సాక్షి గుంటూరు

ఆదివారం । 3 । డిసెంబర్ । 2023




నిత్యాన్నదానానికి విరాళం

విజయవాడ : దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి విజయవాడ ఏలూరు రోడ్డుకు చెందిన కె.సుజాత, కొండిశెట్టి కార్తీ పేరిట రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు.



ఎస్ఎఫ్ఐ మహాసభలు ప్రారంభం

జగ్గయ్యపేట అర్బన్: భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) ఎన్టీఆర్ జిల్లా మహాసభలు శనివారం ఆరంభమయ్యాయి. పేటలోని ఉక్కు కళావేదికపై జరిగిన సభలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పాల్గొన్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 523.30 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 2,550 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

కొనసాగుతున్న పింఛన్ల పంపిణీ

నెహ్రూనగర్: వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ రెండో రోజైన శనివారం గుంటూరు జిల్లాలో సజావుగా సాగింది. శనివారం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వలంటీర్లు పెన్షన్ అందజేశారు. జిల్లా వ్యాప్తంగా ఈ నెలలో 2,59,500 మంది లబ్ధిదారులు ఉండగా వీరి కోసం ప్రభుత్వం రూ.71.35 కోట్లు కేటాయించింది. శనివారం సాయంత్రానికి 2,34,464 మంది లబ్ధిదారులకు రూ.64.46 కోట్ల నగదు అందజేశారు.

అప్రమత్తంగా ఉండండి

కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి



నగరంపాలెం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి చెప్పారు. భారత వాతావరణ శాఖ జారీచేసిన తుపాను హెచ్చరికల దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారితో కలిసి జిల్లా, డివిజన్/ మండల స్థాయి అధికారులతో శనివారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉండటంతో అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేసి ఎటువంటి నష్టం వాటిల్లకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు.

నెలరోజులపాటు అవగాహన కార్యక్రమాలు



గుంటూరు మెడికల్: రాష్ట్ర ప్రభుత్వం డిసెంబరు ఒకటి నుంచి ప్రతిష్టాత్మకంగా ప్రతి ఒక్కరూ ఆరోగ్యశ్రీ పథకాన్ని వినియోగించుకునేలా అవగాహన కార్యక్రమాలు నెలరోజులపాటు నిర్వహిస్తుందని డీఎంహెచ్ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు అన్నారు. ఆశా కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి ఆరోగ్యశ్రీ అవగాహన కరపత్రాన్ని అందజేసి వారికి పథకం గురించి వివరించి, వారు ఉచిత వైద్య సేవలు పొందేలా చూడాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందన్నారు. శనివారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో జిల్లాలోని 1,172 మంది ఆశాలకు, ఒక్కొక్కరికి రెండు చొప్పున యూనిఫామ్ చీరలు డాక్టర్ శ్రావణ్‌బాబు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరికి తెలియజేయాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష బ్రోచర్లను కూడా పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో డీపీహెచ్ఎన్ఓ శాంతకుమారి, హెచ్ఈఈఓ కె.పి.చంద్రశేఖర్, డీసీపీఎం సురేష్ పాల్గొన్నారు.

గుంటూరు-రేపల్లె మార్గంలో రైళ్లు రద్దు

తెనాలిరూరల్: తుపాను నేపథ్యంలో గుంటూరు-రేపల్లె మార్గంలో రైళ్లన్నింటినీ రద్దు చేసినట్టు తెనాలి స్టేషన్ మేనేజర్ టీవీ రమణ శనివారం రాత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మార్గంలో ఈనెల 5వ తేదీ వరకు అన్ని రైళ్లను అధికారులు రద్దు చేశారన్నారు. విజయవాడ-చెన్నై మార్గంలో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లనూ రద్దు చేశారని చెప్పారు. ప్రయాణికులు గమనించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

తెలివిగా శ్రమిస్తే విజయం తథ్యం

- సివిల్స్ విజేత బాలలత వెల్లడి
- 'సాక్షి' గ్రూప్-1,2 సెమినార్ గ్రాండ్ సక్సెస్
- గుంటూరులోని ఏసీ కళాశాలలో జరిగిన అవగాహన సదస్సుకు విశేష స్పందన
- పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన అభ్యర్థులు
- సివిల్స్, గ్రూప్-1,2 పరీక్షల సన్నద్ధత, ప్రణాళికపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించిన బాలలత
- 'సాక్షి' సదస్సు ప్రయోజనం చేకూర్చిందన్న అభ్యర్థులు



సెమినార్‌లో మాట్లాడుతున్న సివిల్స్ టాపర్ బాలలత



సదస్సుకు హాజరైన పోటీ పరీక్షల అభ్యర్థులు, విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్/ నగరంపాలెం(గుంటూరు వెస్ట్): తెలివిగా శ్రమిస్తే సివిల్స్, గ్రూప్-1, 2 వంటి పోటీ పరీక్షల్లో విజయం తథ్యమని సివిల్స్ విజేత బాలలత పేర్కొన్నారు. గుంటూరులోని ఆంధ్ర క్రైస్తవ (ఏసీ) కళాశాలలో శనివారం "సాక్షి" మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో గ్రూప్-1, 2 పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులతోపాటు బీటెక్, డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ నుంచి ముఖ్య వక్తగా పాల్గొన్న బాలలత మాట్లాడుతూ ఏపీపీఎస్సీ త్వరలో గ్రూప్-1, గ్రూప్-2 నోటిఫికేషన్లు విడుదల చేయనున్న దృష్ట్యా, ఆయా పోటీ పరీక్షల్లో విజయసాధనే లక్ష్యంగా ఉన్న అభ్యర్థులు ప్రణాళికాబద్ధంగా సన్నద్ధం కావాలని సూచించారు. గతంలో జరిగిన గ్రూప్-1, 2 పరీక్షల ప్రశ్నపత్రాలను అధ్యయనం చేస్తే ప్రశ్నలస్థాయి, సరళిపై అవగాహన సిద్ధిస్తుందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. రాష్ట్ర భౌగోళిక స్వరూపం, నిధులు, తీరప్రాంతం, జిల్లాల పునర్విభజనతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి సూచీలో స్థానం, రాష్ట్ర బడ్జెట్‌పై సమగ్ర అవగాహన అవసరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ద్వారా క్రీడల్లో ప్రోత్సాహం, పోటీతత్వం పెంచేందుకు తీసుకుంటున్న చర్యలను అధ్యయనం చేయాలన్నారు. ఏపీలో స్కిల్ డెవలప్‌మెంట్, కరెంట్ అఫైర్స్, గాలేరు-నగరి సుజల స్రవంతి, అవుకు రెండో టన్నెల్ ప్రారంభోత్సవం, తుఫాన్‌లకు వేర్వేరు పేర్లు పెట్టడం వెనుక ఉద్దేశం ఏమిటనే అంశాలు తప్పనిసరిగా తెలుసుకోవాలని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, ప్రముఖుల పేర్లు, నాగార్జునసాగర్ ప్రాజెక్టు సమగ్ర సమాచారంతోపాటు స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌లో గుంటూరు జిల్లాకు 3వ స్థానం రావడం వంటి అనేక అంశాలపై పట్టు ఉండాలని సూచించారు. రాష్ట్రంలో పెట్టుబడులు, సంక్షేమ కార్యక్రమాలతో సహా అన్ని అంశాలపై నోట్సు తయారు చేసుకోవాలని చెప్పారు. ప్రపంచ బ్యాంకు నిధులతో చేపట్టిన సాల్ట్ ప్రోగ్రాం, జగనన్న ఆరోగ్య సురక్ష, అమ్మఒడి, విద్యాదీవెన, రైతు భరోసా, వైఎస్సార్ లా నేస్తం, విద్యాకానుక కిట్లు, గోరుముద్ద వంటి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై కచ్చితంగా ప్రశ్నలు ఉంటాయని వివరించారు.

రాత్రీపగలూ చదవనవసరం లేదు

పోటీ పరీక్షలకు సన్నద్ధం పేరుతో రాత్రీపగలూ చదవడం వలన ప్రయోజనం ఉండదని, హార్డ్ వర్క్ కంటే తెలివిగా శ్రమించడం వల్లే విజయం సాధించగలమని బాలలత చెప్పారు. విషయపరిజ్ఞానం, ప్రశ్నల సరళిని అర్థం చేసుకునే నైపుణ్యంగలవారే గెలుపు అందుకుంటారని వివరించారు. చదువుకుటూ రాయడం అత్యంత కీలకమని, సివిల్స్‌లో టాప్ ర్యాంకర్లుగా నిలిచిన వాళ్లు చేసిన పని ఇదేనని చెప్పారు. చదివిన ప్రతి అంశాన్నీ నోట్సులో రాసుకుని, తిరిగి మళ్లీ చదవడం ద్వారా ప్రతి విషయాన్ని గుర్తుంచుకుంటామని చెప్పారు. ప్రణాళికాబద్ధంగా రోజుకు రెండు చొప్పున ఒక ఇష్టమైన ఒక కష్టమైన సబ్జెక్టును చదవాలని సూచించారు. సదస్సులో సాక్షి బ్రాంచ్ మేనేజర్ టి.గోపి, యాడ్స్ మేనేజర్ ఎంవీడీ సత్యనారాయణ పాల్గొన్నారు.

చక్కటి బోధన..



అగ్రికల్చర్ ఫీల్డ్ ఆఫీసర్ పరీక్షకు ప్రిపేరవుతున్నా.. సాక్షి ఎడ్యుకేషనల్ వెబ్‌సైట్ చాలా ఉపయోగకరంగా ఉంది. ప్రస్తుతం పోటీ పరీక్షలకు ఎలా సిద్ధమవ్వాలనేది సదస్సులో చక్కగా వివరించారు. ఎలా చదవాలనేది బాగా చెప్పారు. ఉద్యోగం సాధిస్తాననే నమ్మకం ఏర్పడింది.

– కె.లీలావాణి, గుంటూరు

అవగాహన సదస్సులతో మేలు



గ్రూప్-2 ఉద్యోగానికి సిద్ధమవుతున్నా. ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నా. అయితే సాక్షి దినపత్రిక ఏపీ అంతటా నిర్వహిస్తున్న ఇటువంటి అవగాహన సదస్సులు నాలాంటి అభ్యర్థులకు ఉపయోగకరంగా ఉంటాయి. ఈ సదస్సు నాకు ఎంతో ప్రయోజనకరంగా ఉంది.

– సాదం మల్లికార్జునరావు, ఒంగోలు, ప్రకాశం జిల్లా

విజయంపై నమ్మకం వచ్చింది



ఏపీపీఎస్సీకి ప్రిపేరవుతున్నా.. గతంలో విజయవాడలో జరిగిన సదస్సుకు హాజరయ్యా. ఇప్పుడు గుంటూరు జిల్లాలో జరిగిన సదస్సుకు హాజరయ్యా. ఈ రెండు అవగాహన సదస్సుల్లో వక్తలు చెప్పిన అంశాలు బాగున్నాయి. దీనివల్ల నాకు నమ్మకం ఏర్పడింది.

– గీతాంజలి, వడాలి గ్రామం, ముదినేపల్లి, విజయవాడ

పోటీతత్వంతో ముందుకు వెళ్లాలి



ముందు పోటీతత్వం అలవడాలి. ప్రిపరేషన్ ప్రణాళికాబద్ధంగా ఉండాలి. నోట్సు సిద్ధం చేసుకోవాలి. తెల్లవారుజామునే లేచి చదవాలి. ఓపిక ఉండాలి. ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలో చదివిన తాను యూపీఎస్సీ మెయిన్స్ రాశాను. గ్రూప్-1 ఆఫీసర్‌గా విజయం సాధించాను. రోజుకు 8 నుంచి 10 గంటలపాటు ప్రణాళికతో చదివితే ఉద్యోగం ఖాయం.

– కె.రఘు, జిల్లా ఉపాధి కల్పనాధికారి, గుంటూరు

ప్రతి విషయంపై ఆసక్తి అవసరం



పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు ప్రతి విషయాన్నీ తెలుసుకోవాలనే ఆసక్తి ఉండాలి. ఎలాగైనా గెలవాలనే స్ఫూర్తిని ముందు మనకు మనం పొందాలి. సివిల్స్, గ్రూప్-1 పరీక్షల్లో విజయం సాధించిన వారితోపాటు ఫెయిలైన వారితో మాట్లాడి కారణాలను తెలుసుకునే ప్రయత్నం చేయాలి. జాగ్రఫీ, పాలిటీ, ఎకానమీలతోపాటు కరెంట్ అఫైర్స్‌పై అప్‌డేట్ అవుతుండాలి. – ప్రవీణ్, ఫ్యాకల్టీ

సమయపాలన ఎంతో అవసరం



ప్రణాళికాబద్ధమైన కృషి, సమయపాలన అభ్యర్థులకు ఎంతో అవసరం. పోటీ పరీక్షల సమాచారంతోపాటు ఉద్యోగ నియామక పరీక్షలు, విద్యార్థులకు అత్యంత విలువైన సమాచారాన్ని అందించడంలో సాక్షి విశేషంగా కృషి చేస్తోంది. గతంలో సాక్షి అందిస్తున్న భవితలో ఐఐటీ-జేఈఈ విద్యార్థులకు ఉపయోగపడే విధంగా గణితంలో రైటర్‌గా ఆర్టికల్స్ రాశాను. సోషల్ మీడియా ప్రభావంతో విద్యార్థుల్లో రైటింగ్, రీడింగ్ స్కిల్స్ తగ్గిపోతున్నాయి. అభ్యర్థులు తమ శ్రమను నమ్ముకుని పోటీ పరీక్షల్లో విజయాన్ని సాధించాలి.


– డాక్టర్ కె.మోజెస్, ఏసీ కళాశాల ప్రిన్సిపాల్

వరిపై 'మిచాంగ్' పడగ

'రెండున్నర ఎకరాల సొంత మాగాణి భూమి ఉంది. మరో రెండెకరాలు కౌలుకు తీసుకున్నా. రెండెకరాలకు రూ.50 వేలు కౌలు కట్టా. పంటసాగుకు ఎకరాకు రూ.25 వేల చొప్పున రూ.1.10 లక్షల వరకు పెట్టుబడి పెట్టాను. పంట విరగ్గాసింది. పదిరోజుల్లో కోతకు వస్తుంది. మార్కెట్లో ధాన్యానికి మంచి రేటుంది. పంట చేతికొస్తే నాలుగు డబ్బులు మిగులుతాయని ఆశతో ఉన్నా. ఈలోగానే తుఫాన్ వార్త అశనిపాతంలా మారింది. ఏం చేయాలో పాలుపోవటం లేదు.'

– కొల్లిపర మండలం తూములూరుకు చెందిన రైతు కొల్లి చంద్రశేఖరరెడ్డి ఆందోళన ఇది.

- అన్నదాతల గుండెల్లో తుఫాన్
- ముదురు వరి చేలల్లో సాగుతున్న నూర్పిడి ప్రక్రియ
- మరో 7-10 రోజుల్లో సిద్ధంకానున్న లేత వరిచేలు
- ఈలోగానే తుఫాన్ హెచ్చరికలతో దిక్కుతోచని మాగాణి రైతాంగం



తూములూరులో విరగపండిన వరిచేను

తెనాలి: కోస్తాంధ్రపై 'మిచాంగ్' తుఫాన్ పడగ విప్పింది. వరి రైతుల గుండెల్లో కల్లోలం రేపుతోంది. గుంటూరు జిల్లాలో మాగాణి విస్తీర్ణం 1,52,411 ఎకరాలు కాగా, అందులో 1.37 లక్షల ఎకరాల్లో వరి సాగుచేసిన విషయం తెలిసిందే. పశ్చిమడెల్టా పరిధిలోని తెనాలి డివిజన్‌లోనే వరి సాగు విస్తీర్ణం అధికం. తెనాలి, దుగ్గిరాల, కొల్లిపర మండలాల్లో ముందుగా వెదజల్లిన వరి చేలు ప్రస్తుతం కోతకు వచ్చాయి. పదిరోజులుగా ఆయా చేలల్లో యంత్రాలతో ఒకేసారి నూర్పిడి చేసేస్తున్నారు. ఎకరాకు 35-40 బస్తాల దిగుబడి వస్తుండటంతో రైతాంగం సంతోషంతో ఉంది. దీనికితోడు మార్కెట్లో క్వింటాలు ధాన్యం రూ.1,700 పలుకుతోంది. నూర్పిడి చేసి, తేమశాతం తగ్గేవరకు చేలగట్లు, రోడ్లపైన ఆరబెడుతున్నారు. వ్యాపారులు కూడా కల్లాల్లోనే కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతానికి తెనాలి, దుగ్గిరాల, కొల్లిపర మండలాల్లో వరి సాగు చేసిన 44,200 ఎకరాల్లో ముదురు వరి చేలు 11 వేల ఎకరాల్లో నూర్పిడి పూర్తయింది. మిగిలిన ఆయకట్టుతోపాటు జిల్లాలోని ఇతర ప్రాంతాల్లోనూ వరిపైరు మరో వారం, పది రోజుల్లో కోతకు సిద్ధం కానుంది. నెలాఖరుకు దాదాపుగా నూర్పిళ్లు పూర్తవుతాయి. ఈ సమయంలో మిచాంగ్ తుఫాన్ హెచ్చరికలతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

ఈ చర్యలు చేపడితే మేలు

గింజ గట్టిపడి కోతకు సిద్ధంగా ఉన్న వరిలో సత్వరం కంబైన్డ్ హార్వెస్టర్ ఉపయోగించి, వచ్చిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతంలో వర్షానికి తడవకుండా ఆరబెట్టుకోవాలని వ్యవసాయశాఖ తెనాలి ఏడీఏ ఉషారాణి తెలియజేశారు. తగినన్ని టార్పాలిన్, పాలిథిన్ పట్టాలను పూర్తిస్థాయిలో అందుబాటులో పెట్టుకుని, తుఫాన్ వెలిసిన తర్వాత ధాన్యాన్ని ఆరబెట్టుకునేలా చూసుకోవాలని తెలిపారు. పంట కోసి పనలపై ఉన్నట్టయితే కట్టలు కట్టి గూడు/ కుప్పలుగా వేసుకోవాలని సూచించారు.

పోలింగ్ కేంద్రాల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వీఆర్వో, ఆర్ఐలకు షోకాజ్ నోటీసులు



నంబూరులోని పోలింగ్ కేంద్రంలో బీఎల్వోలతో మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

పెదకాకాని: ఓటర్ జాబితాలో పేర్లను సరి చూసుకునేందుకు నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంపెయిన్ డేను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. శని, ఆదివారాల్లో ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద కొత్త ఓటర్ల పేర్ల నమోదు, డ్రాఫ్ట్ లిస్టులో మార్పులు, చేర్పులకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. నంబూరు జిల్లా పరిషత్ పాఠశాల, ప్రాథమిక పాఠశాల్లోని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్వోల పర్యవేక్షణలో జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని శనివారం కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. బీఎల్వోలతో మాట్లాడి కార్యక్రమం ఎలా సాగుతోందో అడిగి తెలుసుకున్నారు. సూచనలు, సలహాలు అందించారు. బీఎల్వోలు సాయంత్రం 5 గంటల వరకూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. అంతకు ముందు నంబూరు ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ తీరును కలెక్టర్ పరిశీలించారు. భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఈఆర్ఓ హరి హరనాథ్, తహసీల్దార్ పి.రత్నం, ఆర్ఐ రాజేశ్వరి, వీఆర్ఓలు, పంచాయతీ కార్యదర్శులు, బీఎల్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బందిపై కలెక్టర్ ఆగ్రహం

పెదకాకాని మండలంలోని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరి, వీఆర్వో ఎస్.జయంతిలపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితాల క్లెయిమ్‌ల వివరాల రిజిస్టర్లు సరిగా పూరించకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం తగదని హెచ్చరించారు. దీంతో ఆర్ఐ, వీఆర్వోలకు శనివారం సాయంత్రం షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు పొన్నూరు నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి హరిహరనాథ్ తెలిపారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతున్న చిన్నారులకు ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

గుంటూరు మెడికల్: వినుకొండలో విద్యుత్ షాక్‌కు గురై తీవ్ర గాయాలై, గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముగ్గురు చిన్నారుల్ని వినుకొండ శాసన సభ్యుడు బొల్లా బ్రహ్మనాయుడు శనివారం పరామర్శించారు. రూ. లక్ష ఆర్థిక సహాయాన్ని చిన్నారుల తల్లిదండ్రులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ చిన్నారులు త్వరగా కోలుకొని ఇంటికి రావాలని ఆకాంక్షించారు. ఈ ఘటనను సీఎం దృష్టికి తీసుకెళ్లామని, సానుకూలంగా స్పందించారని తెలిపారు. ప్రభుత్వం తరఫున బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆసుపత్రిలో చిన్నారులకు అందుతున్న వైద్యసేవల గురించి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలని ఆయనకు సూచించారు. ఆంధ్రప్రదేశ్ కుమ్మర శాలివాహన సంఘం ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా సంఘం సభ్యులు బాధిత చిన్నారులకు ఆర్థిక సహాయం అందజేసినట్లు రాజవరపు ఏడుకొండలు, ఇందుర్తి వెంకట శివన్నారాయణ, పొరల అంకమ్మరావు, చిడతనగళ్ల గోపి, టి. సీతామహాలక్ష్మి తెలిపారు.

వరి కోతలు వాయిదా వేసుకోవాలి
-జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు

కొరిటిపాడు(గుంటూరు): తుపాను ప్రభావంతో వరి రైతులు తగు జాగ్రత్తలు, సూచనలు పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు సూచించారు. ఆయన శనివారం 'సాక్షి'తో మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా ఆదివారం నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు. నెల్లూరు-మచిలీపట్నం వద్ద ఈ నెల 5న తుపాను తీరం దాటే అవకాశం ఉందని తెలిపారు. జిల్లాలో సుమారు 56 వేల హెక్టార్లలో రైతులు వరి పంట సాగు చేశారని, ఇప్పటి వరకు 16 వేల హెక్టార్లలో పంట కోసి నూర్పిడి చేసినట్లు పేర్కొన్నారు. తుపాను వల్ల రైతులు వరి పంట కోతల్ని వాయిదా వేసుకోవాలని ఆయన సూచించారు. పంట పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా చిన్న చిన్న కాలువల్ని ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఈదురు గాలులకు వరి పంట పడిపోతే మొలకెత్తకుండా ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలని ఆయన సూచించారు.

'ఆడుదాం ఆంధ్ర'తో గ్రామీణ క్రీడాకారుల ప్రతిభకు ప్రోత్సాహం

పోస్టర్ల ఆవిష్కరణలో కలెక్టర్ ఎం వేణుగోపాలరెడ్డి

నెహ్రూనగర్: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడల్ని ప్రోత్సహించి, క్రీడాకారుల ప్రతిభను వెలికితీసే లక్ష్యంతో ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్ర' పోటీల్ని నిర్వహిస్తోందని జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాలరెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో శనివారం ఆయన సంయుక్త కలెక్టర్ జి. రాజకుమారితో కలసి పోటీలపై విలేకరుల సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ చురుకైన జీవన శైలిని అవలంబించడానికి, ఆరోగ్య పరమైన జీవన విధానాన్ని ఆచరించడానికి జరుగుతున్న 'ఆడుదాం ఆంధ్ర' పోటీలు డిసెంబరు 15 నుంచి జిల్లాలో ప్రారంభమవుతాయని తెలిపారు. క్రీడాకారుల నమోదు 2023 నవంబరు 27 నుంచి ప్రారంభించినట్లు చెప్పారు. సచివాలయాల్లోను, వలంటీర్ల ద్వారా, 1902కు కాల్ చేసి లేదా https://aadudamandhra.ap.gov.in/ వెబ్‌సైట్ లోనూ డిసెంబరు 13వ తేదీ వరకు నమోదు చేసుకోవచ్చని వెల్లడించారు. రిజిస్ట్రేషన్ల నమోదుపై ఇప్పటికే ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ సచివాలయం యూనిట్‌గా, పట్టణ ప్రాంతాల్లో వార్డు సచివాలయం యూనిట్‌గా క్రీడల్ని నిర్వహించనున్నట్లు వివరించారు. సచివాలయ స్థాయిలో గెలుపొందిన వారికి మండల స్థాయిలోను అక్కడ గెలుపొందిన వారికి నియోజకవర్గ స్థాయిలో, తదుపరి జిల్లా స్థాయిలోను, రాష్ట్ర స్థాయిలోను పోటీల్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడల్లో 15 సంవత్సరాలు వయస్సు దాటిన యువతీ, యువకులు పాల్గొనవచ్చని చెప్పారు. క్రికెట్, బాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడాంశాలలో పోటీలు ఉంటాయని వివరించారు. గెలుపొందిన జట్లకు నియోజకవర్గ స్థాయి నుంచి నగదు బహుమతులు అందించనున్నట్లు పేర్కొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాలరెడ్డి, జేసీ రాజకుమారి

బహుమతులు ఇలా...

- క్రికెట్, కబడ్డీ, ఖోఖో , వాలీబాల్ క్రీడాంశాలకు సంబంధించి నియోజకవర్గ స్థాయిలో మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు రూ.35,000, రూ.15,000, రూ. 5000, జిల్లా స్థాయిలో మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు రూ. 60,000, రూ.30,000, రూ.10,000, రాష్ట్ర స్థాయిలో మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు రూ.5,00,000, రూ. 3,00,000, రూ. 2,00,000గా నిర్ణయించినట్లు వెల్లడించారు.
- బాడ్మింటన్ క్రీడాంశానికి నియోజకవర్గ స్థాయిలో మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు రూ.20,000, రూ. 10,000, రూ. 5,000, జిల్లా స్థాయిలో మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు రూ. 35,000, రూ. 20,000, రూ. 10,000, రాష్ట్ర స్థాయిలో మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు రూ. 2,00,000, రూ. 1,00,000, రూ. 50,000 అందించనున్నట్లు తెలియజేశారు.
- సచివాలయ స్థాయి పోటీలు డిసెంబరు 15 నుంచి 2024 జనవరి 1 వరకు, మండల స్థాయి పోటీలు జనవరి 2 నుంచి జనవరి 15 వరకు, నియోజక వర్గ స్థాయి పోటీలు జనవరి 16 నుంచి జనవరి 21 వరకు, జిల్లా స్థాయి పోటీలు జనవరి 22 నుంచి జనవరి 28 వరకు, రాష్ట్రస్థాయి పోటీలు జనవరి 29 నుంచి ఫిబ్రవరి 3 వరకు జరుగుతాయని కలెక్టర్ వివరించారు.

క్రీడల నిర్వహణకు కమిటీలు

వాలీబాల్ టీంకు 12 మంది సభ్యులు, ఖోఖో టీంకు 15 మంది సభ్యులు, కబడ్డీ టీంకు 12 మంది సభ్యులు, బాడ్మింటన్ టీంకు ఇద్దరు (2) సభ్యులు, క్రికెట్ టీంకు 16 మంది సభ్యులు తప్పనిసరిగా ఉండాలన్నారు. క్రీడల నిర్వహణకు గ్రామ, మండల, జిల్లా స్థాయిలోను కమిటీల్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. చైర్మన్‌గా జిల్లా కలెక్టర్ , నోడల్ అధికారిగా జిల్లా సంయుక్త కలెక్టర్ క్రీడల నిర్వహణను నిరంతరం పర్యవేక్షిస్తారని చెప్పారు. ఇప్పటికే జిల్లాకు క్రీడా సామగ్రి సరఫరా చేశామని తెలిపారు. గుంటూరు జిల్లాలో 568 గ్రామ, వార్డు సచివాలయాలు, 18 మండలాలు, ఏడు నియోజకవర్గాలు, జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. క్రీడల నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, 244 ప్రాంగణాలతో పాటు 312 పీఈటీలు, పీడీలను ఎంపిక చేసినట్లు చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులు మినహా జిల్లాలోని 15 సంవత్సరాల వయస్సు నిండిన మహిళలు, పురుషులు క్రీడలలో పాల్గొనే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. తొలుత ఆడుదాం ఆంధ్ర (కృష్ణ జింక)తో రూపొందించిన క్రీడల ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి డి. వెంకటేశ్వర్లు, స్టెప్ సీఈవో ఎస్. పల్లవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం నుంచి ఆరోగ్యశ్రీ కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. జీజీహెచ్‌లో జరిగిన కార్యక్రమంలో పోస్టర్లను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఆవిష్కరించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్, డీఎంఈ డాక్టర్ నరసింహం, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి, ఆరోగ్యశ్రీ జిల్లా కో- ఆర్డినేటర్ డాక్టర్ చీకటి విజయప్రకాష్ పాల్గొన్నారు.

వచ్చే ఏడాది కార్మికుల జాతీయ సెలవులు ఇవే...

లక్ష్మీపురం: ఆంధ్రప్రదేశ్ దుకాణాలు, సంస్థల చట్టం 1988, ఆంధ్రప్రదేశ్ ఫ్యాక్టరీలు, సంస్థలు జాతీయ పండగులు, ఇతర సెలవులు చట్టం 1974 ప్రకారం గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో గల పలు సంస్థలు, ఫ్యాక్టరీల్లో పనిచేస్తున్న కార్మికులకు 2024 సంవత్సరానికి వేతనంతో కూడిన సెలవు దినాలు నిర్ణయించినట్లు గుంటూరు జోన్ సంయుక్త కార్మిక కమిషనర్ ఎస్.శ్రీనివాస్‌కుమార్ శనివారం తెలిపారు. 2024 జనవరి 26 రిపబ్లిక్ డే, మే డే, స్వాతంత్ర్య దినోత్సవం ఆగస్టు 15, గాంధీ జయంతి అక్టోబరు 2, ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం నవంబరు 1ని ప్రకటించారు. పండుగ సెలవులు కనుమ జనవరి 16, రంజాన్ ఏప్రిల్ 11, విజయదశమి అక్టోబరు 12, క్రిస్టమస్ డిసెంబరు 25 ప్రకటించారు.

పరుగుల వరద సృష్టించిన ఉత్తరాఖండ్ జట్టు

మంగళగిరి: నగర పరిధిలోని నవులూరు అమరావతి క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న 3 డే విజయ్ మర్చంట్ అండర్ - 16 బాయ్స్ ట్రోఫీ క్రికెట్‌లో రెండో రోజు శనివారం ఉత్తరాఖండ్ జట్టు పరుగుల వరద సృష్టించింది. తొలి రోజు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కర్నాటక జట్టు 81.02 ఓవర్లలో 236 పరుగులకు ఆలౌటైంది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన ఉత్తరాఖండ్ జట్టు 103 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 381 పరుగులు సాధించింది. జట్టు బ్యాట్స్‌మన్ లక్ష్య రాయ్‌చందన్ 169 పరుగులు, సామ్రాట్ సోమ్వాల్ 133 పరుగులతో చెలరేగి పోయారు.


167 పరుగులు సాధించిన లక్ష్య రాయ్


133 పరుగులు సాధించిన సామ్రాట్

కుప్పకూలిన ఆక్టోపస్ కానిస్టేబుల్

చికిత్స పొందుతూ మృతి


కానిస్టేబుల్ సోమేశ్వరరావు

మంగళగిరి: ఫిజికల్ యాక్టివిటీ టెస్ట్‌లో పాల్గొన్న ఆక్టోపస్ కానిస్టేబుల్ మృతి చెందిన ఘటన నగరంలోని ఎయిమ్స్ ఆసుపత్రిలో చోటు చేసుకుంది. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాకుళం జిల్లా సంతకవిటి మండలం వాల్తేరుకు చెందిన గురుగుబెల్లి సోమేశ్వరరావు(33) ఆక్టోపస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం నగర పరిధిలోని ఏపీఎస్పీ ఆరో బెటాలియన్‌లో ఉన్న పోలీస్ పరేడ్ మైదానంలో ఫిజికల్ యాక్టివిటీ టెస్ట్‌లో పాల్గొని అకస్మాత్తుగా కుప్పకూలిపోయాడు. గమనించిన తోటి కానిస్టేబుల్స్ హుటాహుటిన ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సోమేశ్వరరావు మృతి చెందాడు. సమాచారం అందుకున్న రూరల్ ఎస్ఐ క్రాంతికుమార్ ఎయిమ్స్‌కు చేరుకుని సోమేశ్వరరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించగా స్వగ్రామానికి తరలించారు. ఆక్టోపస్ ఏఎస్ఐ ఎం. ప్రవీణ్ ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడు సోమేశ్వరరావు భార్య, కుమార్తె ఉన్నారు.

ప్రాసిక్యూషన్ లోపాలు లేకుండా వ్యవహరించాలి

ప్రాసిక్యూషన్ ఆఫ్ డైరెక్టర్ సుదర్శన్‌రెడ్డి

పట్నంబజారు: రాష్ట్రంలో అధికంగా నమోదవుతున్న పోక్సో, గంజాయి కేసుల విచారణలో కోర్టుల్లో ప్రాసిక్యూషన్ ఎలాంటి లోపాలు లేకుండా వ్యవహరించి, ఆయా కేసుల్లో నిందితులకు శిక్ష పడేలా చేయాలని ప్రాసిక్యూషన్ ఆఫ్ డైరెక్టర్ సుదర్శన్‌రెడ్డి చెప్పారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం గుంటూరు, కృష్ణా జిల్లాల పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సమావేశం నిర్వహించారు. డీపీటీ డైరెక్టర్ మధుసూదనరావు అధ్యక్షత వహించారు. ప్రాసిక్యూషన్ ఆఫ్ డైరెక్టర్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ మెగా లోక్ అదాలత్‌లు జరిగినప్పుడు కోర్టులకు ప్రాసిక్యూటర్లు సహకరించాలని ఆదేశించారు. జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి పార్థసారథి, స్పెషల్ కోర్టు న్యాయమూర్తి శరత్‌బాబు, మొదటి అదనపు జిల్లా జడ్జి రాజగోపాల్ మాట్లాడుతూ సీడీ ఫైల్స్‌ను ప్రాసిక్యూటర్లకు వారం ముందుగానే పోలీసులు అందజేయాలని చెప్పారు. అడిషనల్ ఎస్పీ కె.సుప్రజ మాట్లాడుతూ ప్రాసిక్యూటర్‌కు అన్నిరకాలుగా సహకారం అందించి, నిందితులకు శిక్షపడేలా సహకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా డెప్యూటీ డైరెక్టర్ కల్యాణి, జువైనల్ జస్టిస్ బోర్డ్ సీనియర్ ఏపీపీ సుద్దపల్లి సుకుమార్, స్పెషల్ కోర్టు పీపీ ఎన్.శారదామణి, గుంటూరు, కృష్ణా జిల్లాల కేడర్, పరిమిత కాలపు ప్రాసిక్యూటర్లు పాల్గొన్నారు. చివరలో బార్ కౌన్సిల్ మెంబర్ బ్రహ్మారెడ్డి వందన సమర్పణ చేశారు. ప్రాసిక్యూషన్స్ ఆఫ్ డైరెక్టర్ సుదర్శన్‌రెడ్డిని గజమాలతో ఘనంగా సత్కరించారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రాసిక్యూషన్ ఆఫ్ డైరెక్టర్ సుదర్శన్‌రెడ్డి